కడప విమానాశ్రయంలో కాసేపు సిఎం..

శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం గ్రామంలో నిర్వహించే భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనలో పాల్గొనేందుకు గన్నవరం నుంచి విమానంలో బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం 1.05 గంటలకు కడప విమానాశ్రయానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేరుకున్నారు. ఆయనకు ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, శాసనమండలి వైస్ చైర్మన్ జఖియా ఖనం, కలెక్టర్ వి.విజయ్ రామరాజు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్యేలున్నారు. కాసేపు వారితో మాట్లాడి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 1.22 గంటలకు బయలుదేరి వెళ్లారు.

హద్దులు దాటిన 'అరటి'

- విదేశాల్లో డిమాండ్
- రైతులకు భరోసానిస్తున్న పంట
- విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- టన్ను ధర రూ.19 వేలు పలుకుతున్న వైనం

ప్రజాశక్తి - చాపాడు

మన ప్రాంత అరటి అంతర్జాతీయ మార్కెట్‌లోనూ సత్తా చాటుతోంది. ఎగుమతులను పెంచుకుంటూ రైతులకు భరోసా కల్పిస్తోంది. ఎగుమతులను మరింతగా ప్రోత్సహించాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ కొనుగోలుదారులు, అమ్మకందారులతో ఇప్పటికే ఒక వేదికను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 35 వేల టన్నుల అరటి పండ్లను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నిర్ణయంతో రానున్న రోజుల్లో అరటి సాగుదారులకు మరింత ప్రయోజనం కలగనుంది. రాష్ట్రంలో 63.84 లక్షల టన్నుల అరటి పండ్లు ఉత్పత్తి అవుతుండగా, ఇందులో ఒక్క వైఎస్ఆర్ కడప జిల్లా నుంచే 23,15,300 టన్నుల దిగుబడి వస్తోంది. ఒక్క పులివెందులలోనే 1,100 హెక్టార్లలో అరటి సాగవుతుండగా ఇక్కడి పంటకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు కూడా లభిస్తోంది. సాధారణంగా అరటి పండ్లు 6, 7 రోజులు మాత్రమే నిల్వ ఉంటాయి. మన జిల్లాలో సాగయ్యే పండ్లు 14 రోజుల వరకు నిల్వ ఉంటున్నాయని రైతులు, వ్యాపారులు పేర్కొంటున్నారు. టిష్యూ కల్చర్ వచ్చాక పండ్లలో నాణ్యత పెరిగిందని సూచిస్తున్నారు. కడప జిల్లాలో సాగైయ్యే అరటిలో 80 శాతం చెన్నై, బెంగళూరు నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. రాష్ట్రంలో 1,12,995 హెక్టార్లలో అరటి సాగవుతోంది. ఏటా 63,84,730 టన్నుల అరటి పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అరటి సాగవుతుండగా విస్తీర్ణం ఉత్పత్తిలో కడప ప్రథమ స్థానంలో ఉంది. కడప జిల్లాలో పులివెందుల, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గంలో అధికంగా అరటి సాగు అవుతుంది. మధ్య ప్రాచ్య దేశాలైన యుఎఇ, బెహ్రాయిన్, ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఖతార్, ఇరాన్ దేశాల్లో మన అరటికి మంచి డిమాండ్ ఉంది.గ్రీన్ కావెండిష్ ప్రీమియమ్ రకాలు ఆ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. 2016-7లో 246 టన్నుల అరటి పండ్లు ఎగుమతి కాగా, 2017-18లో 4,300 టన్నులు, 2018-19లో 18,500 మెట్రిక్ టన్నులకు ఎగుమతులు పెరిగాయి. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 35 వేల మెట్రిక్ టన్నుల అరటి పండ్లను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సాగు విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు మార్కెట్‌ను విస్తరించేందుకు వీలుగా డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ ఏడాది కడప జిల్లా పులివెందులలో అరటి పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేశారు. దీని కోసం ప్రభుత్వం 70 ఎకరాల భూమిని, పరిశోధనల కోసం 628 ఎకరాల భూమిని కేటాయించింది.

ఇతర రాష్ట్రాలకూ ఆంధ్రా అరటి...

కోస్తా, రాయలసీమలో పండించే అరటి ఇతర రాష్ట్రాలకు సైతం వెళ్తుంది. దిల్లీ, రాజస్థాన్, ఒడిశా, బెంగాల్, బిహార్ రాష్ట్రాలకు ఆంధ్రాలో పండించే అరటిని తరలిస్తున్నారు. అక్కడి నుంచి ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తామని అరటి హోల్ సేల్ వ్యాపారులు పేర్కొంటున్నారు. కడప జిల్లాలో సాగైయ్యే అరటి మంచి నాణ్యతతో ఉండటంతో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో దీనికి బాగా డిమాండ్ ఉంది. మార్కెట్ సీజన్ల వారీగా ఉంటుంది. జులై నుంచి నవంబర్ వరకూ రేటు బాగా పలుకుతుంది. టన్ను రూ. 23వేల వరకు పలికి ప్రస్తుతం క్రమేపి తగ్గుతూ రూ.18వేలు పలుకుతుంది.వేసవిలో మార్కెట్ సాధారణంగా ఉంటుంది. విదేశాలకు ఎగుమతిని చేసే అరటికి సాగు దశలోనే జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకు తగినట్లుగా ఎపి రైతులు వ్యవహరిస్తున్నారు. సౌదీ, దుబాయ్ వంటి దేశాలకు అరటి ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

సబ్సిడీలు దక్కడం లేదు..

అరటి సాగు చేసే వారిలో సాధారణ రైతాంగం ఎక్కువగా ఉంటున్నారు. అయితే ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలు, వివిధ పథకాలు, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలకు, ఇతర ఎగుమతిదారులకు ఉపయోగపడుతున్నాయి తప్ప సామాన్య రైతులకు పెద్దగా ప్రయోజనం దక్కడం లేదని రైతులు పేర్కొంటున్నారు. పెట్టుబడి ఖర్చులు బాగా పెరిగినట్లు రైతులు చెబుతున్నారు. అరటి పంట వాతావరణ మార్పుల మీద ఆధారపడి ఉంటుందని, గాలుల తీవ్రత ఎక్కువైతే పంట మీద ఆశలు వదులుకోవాల్సిందే అంటున్నారు. పంట కాపాడుకోవడానికి కట్టెల సాయంతో మొక్కను నిలబెట్టుకోవాల్సి వస్తుందని, కానీ కష్టపడి పండించిన తర్వాత ధరలు గిట్టుబాటు కావడం లేదని ప్రభుత్వమే పంట కొనుగోలు చేసి ఎగుమతి చేస్తే ఉపయోగంగా ఉంటుదని, సబ్సిడీలు ఇచ్చి, పంటకి మార్కెట్ కల్పిస్తే అరటి రైతుకి ఢోకా ఉండదని అని రైతులు అభిప్రాయపడుతున్నారు.

అరటి పంట విస్తీర్ణం పెరుగుతోంది..

ఎగుమతులతో విదేశాల్లో ఆంధ్ర అరటికి డిమాండ్ కనిపిస్తోంది. సాధారణ రైతుకి మరింత తోడ్పాటు అవసరమనే అభిప్రాయం వినిపిస్తోంది. అది జరిగితే అరటి సాగులో కడప రైతులు మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉంది. జిల్లాలో సాగు కాస్త పెరిగింది. అయితే పులివెందుల ప్రాంతంలో గతంలో కంటే తగ్గి జిల్లాలో ని ఇతర ప్రాంతాలలో సాగు పెరిగింది.

కళ తప్పిన సం'క్రాంతి'

వరుస వర్షాభావం..ధరల దరువు
అప్పుల ఊబిలో సామాన్యులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సం'క్రాంతి' కళ తప్పింది. జిల్లాలో గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లు వర్షాభావం బారిన పడిన ప్రభావం ప్రతిఫలించింది. ప్రతిరైతూ పండుగకు కనీసం రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేయనిదే పండుగ గడవదు. గతేడాది వరుస వర్షా భావాల ప్రభావం కారణంగా విత్తన పడని పరిస్థితి. దీని ప్రభావం గ్రామాల్లో గంగిరెద్దుల కోలాహలం, దూడూ బసవన్నల విన్యాసాలు, హరి దాసుల ఆలాపనలపై పడింది. దీనికితోడు నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల నేపథ్యంలో సామాన్యులు కొత్తబట్టల కొనుగోలు మొదలుకుని పిండివంటలు, తినుబండారాల కుదింపునకు దారి తీసింది. ఏతావాతా చెప్పేదేమంటే ముక్కోటి ఏకాదశి తరహాలో సంక్రాంతి పండుగ ఇట్టే గడిచి పోయిందని చెప్పవచ్చు.

జిల్లాలో సంక్రాంతిపై వర్షాభావం ప్రభావం పడింది. 15 ఏళ్లలో ఎన్నడూ ఎరుని రీతిలో ఖరీఫ్, రబీ సీజన్లలో విత్తనం పడకపోవడం ఆందోళనకర పరిణామం. ఫలితంగా జిల్లా వ్యవసాయ రంగాన్ని కుంగదీసింది. దీంతో రైతులు, కౌలురైతులు, రైతు కూలీలు, సామాన్యుల్లో ఆశించిన ఉత్సాహం కొరవడింది. ఫలితంగా పండుగ ఖర్చులు కుదింపు, సంస్కృతి సంప్రదాయాలు, వితరణలపై ప్రభావం పడింది. ఏటా గ్రామీణులు సంక్రాంతి పండుగను పుర స్కరించుకుని కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు, ఇతర బంధువు లను పిలుచుకుని కొత్తబట్టలు ధరించి, పిండి వంటల ఘుమఘుమల మధ్య మనోల్లా సంగా గడపడం తెలిసిందే. ఈఏడాది వరుస వర్షాభావాల నేపథ్యంలో నిత్యా వసర వస్తువుల ధరలు దరువు వేయడం విస్మయాన్ని కలిగించింది. ప్రతి కుటుం బంపై సగ టున రూ.15 నుంచి రూ.20 వేల భారం పడింది. ఉమ్మడి కడప జిల్లాలో సుమారు 8. 25 లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఇందులో పేద, నిరుపేద, సామాన్యుల కుటుంబాలు 7.25 లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఈలెక్కన ప్రతి కుటుంబంపై సగటున కనీసం రూ.10 వేల చొప్పున లెక్కిస్తే సుమారు రూ.70 కోట్ల భారం పడినట్లు తెలుస్తోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని 51 మండలాల్లోని రైతింట సం క్రాంతి కళ తప్పింది. సాధారణంగా సంక్రాంతికి 15 రోజుల ముందు గ్రామీణుల్లో కొత్త బట్టలు కొనుగోలు చేయడం మొదలుకుని వారం రోజుల ముందు పిండి వంటల తయా రు చేయడం ఆనవాయితీ. పండుగ రోజు రాత్రి నుంచే ముంగిళ్లలో రంగు రంగుల ము గ్గులు, గొబ్బెమ్మలపై గుమ్మడి పూలు పెట్టడం, గంగిరెద్దుల కోలాహలం సరే సరి, హరి దాసుల కీర్తనలు, కాటిపాపర్ల సంచారం, గొబ్బిళ్ల పాటలు వంటి ఇతర సాంస్కృతిక కార్య క్రమాల నిర్వహణ జోరు కని పించేది. ప్రస్తుత సంక్రాంతి పర్వదినంలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల సంఖ్య కనిపించకపోవడం గమనార్హం.

ధరలు విపరీతంగా పెరిగాయి

నిత్యావసర స రుకుల ధరలు విప రీతంగా పెరిగాయి. సంక్రాంతి సందర్భంగా నిత్యా వసర సరుకుల ధరల పెరు గుదలతో ఆర్థికంగా భారం అవుతుంది. కందిబేడలు, చింతపండు, బెల్లం, అలసందలు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం రేషన్ సరుకులలో కోత విధిస్తోంది. పండుగ సరుకులు ప్రభుత్వం సరఫరా చేయాలి.

-సుబ్బమ్మ, గృహిణి, చాపాడు.

నిత్యావసరాలు భారమవుతున్నాయి

నిత్యావరసరుకులు రోజు రోజుకూ సామాన్య ప్రజ లకు భారమౌతున్నాయి. వంట నూనె, సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. గతంలో ప్రభుత్వం పండుగ సరుకులు పంపిణీ చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. వేరుశనగ నూనె కిలో రూ.170కి చేరింది. సామాన్య ప్రజలకు నిత్యావసర సరుకుల ధరలు భారమౌతున్నాయి.ః

- ఐశ్వర్య, గృహిణి, సిద్దారెడ్డిపల్లె, చాపాడు

అంబేద్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి

రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం, స్మృతివనం ప్రారంభోత్సవానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కనీవిని ఎరుగని విధంగా చరిత్రాత్మకమైన స్వరాజ్ మైదానంలో 20 ఎకరాలలో రూ. 400 కోట్లతో 125 అడుగుల ఎత్తు ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఈనెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారన్నారు. విగ్రహంతో పాటు 3,000 మంది కూర్చునే మల్టీ కన్వెన్షన్ హాల్, ఓపెన్ థియేటర్, లైబ్రరీ, ధ్యానం కోసం ప్రత్యేక హాల్, , గ్రీనరి ఏర్పాటు చేసి అద్భుతమైన కళాఖండంగా ప్రభుత్వం తీర్చిదిద్దిందన్నారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగంతోనే దేశంలో ప్రజలు స్వేచ్ఛగా, సమానత్వంగా ఉన్నారని, ప్రపంచంలో అంబేద్కర్ స్థానం ఎంతో గొప్పదని, ఆయన మహోన్నత వ్యక్తి అన్నారు. అంబేద్కర్ అందరివాడు అన్నారు. పార్టీలకు, కులాలకు, మతాలకు, అతీతంగా విగ్రహావిష్కరణలో ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, సమాచార శాఖ సహాయ సంచాలకులు వేణుగోపాల్ రెడ్డి, సంఘ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

బేడ బుడగ జంగ కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చే విధంగా రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదించి కేంద్రానికి పంపే విషయంలో ప్రధాన పాత్ర పోషించిన ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ కు బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైసిపి యువజన జిల్లా కార్యదర్శి పస్తం అంజి కృతజ్ఞతలు తెలియజేశాం ఆర్ అండ్ బి అతిథి గృహంలో పస్తం అంజి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

గాలి పటాలతో వినూత్న నిరసన

- నెత్తి, నోరు కొట్టుకుంటూ అంగన్వాడీల ఆందోళన
- 36వ రోజూ కొనసాగిన సమ్మె
- పార్టీలు, ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వైఎస్ఆర్ జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 36వ రోజుకు చేరుకుంది. వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగించారు. గాలిపటాలు ఎగురవేస్తూ, నెత్తి, నోరూ కొట్టుకుంటూ నిరసన తెలియజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మైదుకూరు : గాలిపటాలతో నిరసన తెలియజేపిస్తున్న అంగన్వాడీలు

జమ్మలమడుగు : అంగన్వాడీల గోడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఒకసారి వినాలంటూ ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. మంగళవారం ఉదయం జమ్మలమడుగు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదురుగా అంగన్వాడీలు ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాస్కును ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూని యన్ నాయకులు భాగ్యమ్మ, లక్ష్మీదేవి, సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, కులాయమ్మ అంగ న్వాడీలు పాల్గొన్నారు. **మైదుకూరు :** రాష్ట్రంలో లక్ష మందికి పైగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు గత 35రోజులకు పైగా నిరసన తెలియజేస్తూ ఉంటే రాష్ట్ర సీఎం జగన్ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుండా గాలికి వదిలేశారని అంగన్వాడీలు నిరసన తెలిపారు. మంగళవారం పండుగ రోజు కూడా మైదుకూరు సిడిపిఒ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు గాలిపటాలతో తమ నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులుధనలక్ష్మి, భారతి, చెన్నమ్మ, రామతులసి, రిజ్వన, జి.లక్ష్మి, రమాదేవి, పుష్ప, అనురాధ, శ్రీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **బద్వేలు :** స్థానిక సమగ్ర శిశు అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో 36వ రోజు మంగళవారం రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మానవత్వం లేని ప్రభుత్వ తీరుని నిరసిస్తూ నెత్తి నోరు కొట్టుకుని తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, పెద్ద ఎత్తున అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **కడప :** అంగన్వాడీల సమ స్యలను గాలికి వదిలేసిన ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డిది అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్, అంగ న్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మీదేవి అన్నారు. సంక్రాంతి కనుమ పండుగ రోజు కూడా అంగన్వాడీల సమ్మె కలెక్టరేట్ ఎదుట కొనసాగింది. మంగళవారం నాటికి అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 36వ రోజుకు చేరుకుంది. తమ డిమాండ్లను గాలిపటాలపై రాసి గాలిలోకి వదిలి నిరసన తెలియజేశారు. 36 రోజులుగా ఎండనక, వాననక రోడ్డు నెక్కి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని సమ్మె బాట పట్టిన అంగన్వాడీల పట్ల ప్రభుత్వం నియంతృత్వ పోకడలో వెళ తూ నిర్లక్ష్యం వహించడాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తీవ్రంగా ఖండి ంచారు. సోమవారం కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం తెలియజేశారు. కార్యక్ర మంలో సహాధ్యక్షుడు వై .రవికుమార్ ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి. రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు మజ్జారి చెన్నకేశవులు, బత్తుల చంద్రశేఖర్, కిరణ్ కుమార్, జి. వెంకటసుబ్బయ్య, శంకర్ బాబు, కీర్తి కుమార్, గంగన్న, కిరణ్ బాబు, శివశంకర్ పాల్గొన్నారు.

కడప : గాలిపటాలు ఎగురవేస్తూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, నాయకులు

బద్వేల్ : నెత్తి, నోరు కొట్టుకుంటూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

జమ్మలమడుగు : జగన్ వేషధారి చుట్టూ తిరుగుతూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

ఆర్థిక బకాయిలను సాధించి తీరుతాం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

నాలుగేళ్ల నుంచి ఉద్యోగ, ఉపాధ్యా యులకు చెల్లించాల్సిన డిఎ, పిఆర్‌సి బకాయిలన్నీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని, వాటిని సాధించడమే లక్ష్యంగా యుటిఎఫ్ పోరు బాట పట్టిందని రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సాంప్రదాయ దుస్తులను ధరించి 'గాలికొదిలిన బకాయిలు' చెల్లించాలంటూ గాలిపటాలను ఎగరవేస్తూ కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అధికారంలోకి రాక మునుపు చెప్పిన మాటలన్నీ 'గాలి మాటలుగా' మారిపోయాయని ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావలసిన ఆర్థిక బకాయిలు చెల్లించకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారని తెలిపారు. ఆర్థిక బకాయిల కోసం పోరుబాట పట్టిన ఉపాధ్యా యులను అడుగడుగునా నిర్బంధాలతో భయభ్రా ంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు .యుటిఎఫ్ చేపట్టిన పోరుబాట ఫలితం పిఎఫ్ సొమ్ములు చెల్లింపులు జరుగుతున్నాయని, ఎపి జిఎల్ఐ, సరెండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్మెంట్, డిఎ, పిఆర్‌సి అరియర్స్, సిపిఎస్ ఉద్యోగుల బకాయిలు ఇంకా చెల్లించకుండా కాలయాపన చేయడం మంచిది కాదని చెప్పారు. కార్యక్రమంలో సహాధ్యక్షుడు వై. రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి. రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయ కులు మజ్జారి చెన్నకేశవులు, బత్తుల చంద్రశేఖర్, కిరణ్ కుమార్, జి. వెంకటసుబ్బయ్య, శంకర్ బాబు, కీర్తి కుమార్, గంగన్న, కిరణ్ బాబు, శివశంకర్, దేవదత్తం, విశ్వనాథ్, రెడ్డయ్య, పోతురాజు చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, శివకుమార్ రాజు, విజయ్ కుమార్, సునీల్, అంధ ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, పార్థసారథి పాల్గొన్నారు. **బద్వేల్ :** ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మంగళవారం గాలిప టాలను ఎగరేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమాన్ని గాలిపటాలలాగే గాలికి వదిలేసిందని పేర్కొంటూ వినూత్న నిరసనను చేపట్టారు. అన్ని రకాల బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించే వరకు తమ పోరాటం ఆగదని, అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చ రించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు టి.శివ ప్రసాద్, బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవానందం, కె.సుధాకర్, గోపవరం మండలం అధ్యక్షులు వీరదాసరి క్రిష్టఫర్, అట్లూరు మండల అధ్యక్షులు సి.కంచిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్.చెన్నయ్య, పి.చక్రపాణి, ఎస్.మస్తాన్ వల్లి, ఎస్.ఎం.డి.గౌస్, ఎన్.పవన్ కుమార్, డి.కొండయ్య, టి.పెంచలయ్య, చంద్రశేఖర్ రాజు పాల్గొన్నారు.

కడప కలెక్టరేట్ ఎదుట గాలిపటాలు ఎగురవేస్తూ నిరసన తెలియజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విందు భోజనం ఏర్పాటు

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

మండలంలోని ప్రజలు సంక్రాంతి పండుగను చాలా వైభవంగా నిర్వహించుకోవడం చాలా ఆనందదాయకంగా ఉందని మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మంగళవారం కనుమ పండుగ రోజూ హిందూ ముస్లిం సోదరులకు పసందైన భోజన ఏర్పాట్లు చేశామన్నారు. తన ఆహ్వానమును స్వీకరించి విందుకు హాజరైన పట్టణ ప్రజలకు, సర్పంచ్‌కు తజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం అభ్యర్థి బొజ్జరోషన్న, మాజీ సర్పంచులు బాష, ఇమామ్ హుస్సేన్, మాజీ ఎంపిటిసి లేత్ మిషన్ షరీఫ్, పట్టణ అధ్యక్షుడు మస్తాన్, ప్రొఫెసర్ భాష, మొగల్ చిన్న, మహబూబ్ బాషా, గంగా పాల్గొన్నారు.

విందు భోజనంలో సర్పంచులు, ప్రముఖులు

నగరానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ తెలుగుదేశం పార్టీ పోలీట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి మాధవి రెడ్డి ని ఘనంగా సన్మానించి, బొకే ఇచ్చి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

చర్చి నిర్మాణానికి ఎంపీ విరాళం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కూనవారిపల్లె పంచాయతీ దళితవాడలో నూతనంగా నిర్మించనున్న చర్చి నిర్మాణానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రూ.2లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆ కాలనీవాసులకు మంగళవారం అందజేశారు. చర్చి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూమన సుబ్బారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రచయిత బొమ్మిశెట్టికి చిత్రపటం బహూకరణ

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు పట్టణానికి చెందిన రచయిత, హిస్టోరియన్ బొమ్మిశెట్టి రమేష్‌కు తన ఛాయా చిత్రాన్ని చిత్రకారుడు కైపు బాలరాజు(బాలు) మంగళవారం రచయిత నివాసంలో బహూకరించారు. రచయితగా, శాసన పరిశోధకుడిగా, చరిత్రకారుడుగా పేరుపొందిన బొమ్మిశెట్టి రమేష్ ఛాయాచిత్రాన్ని గీసి కనుమ పండుగ సందర్భంగా బాలు తనకు అందజేశారని రమేష్ వివరించారు. చరిత్రకు సంబంధించిన మరిన్ని ఛాయాచిత్రాలను వేస్తున్నట్లు బాలు తనకు చెప్పారని రచయిత తెలిపారు. చరిత్రను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉందన్నారు. దానికోసం తన వంతు కృషి చేస్తున్నట్లు రచయిత ఈ సందర్భంగా తెలిపారు.

రమేష్‌కు ఛాయాచిత్రాన్ని బహూకరిస్తున్న బాలరాజు

కార్నియాలను అందజేస్తున్న కుటుంబ సభ్యులు

నేత్రదానంతో మరొకరికి చూపు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

తొండూరు మండలం మల్లెల గ్రామానికి చెందిన అంకిరెడ్డి అశ్వర్థమ్మ మంగళవారం మృతి చెందడంతో ఆమె కుమారుడు ఈశ్వర్‌రెడ్డి, కుమార్తెలు ఈశ్వరమ్మ, లక్ష్మీదేవి, మహేశ్వసుమిత్ర, కోడలు జానకిదేవి నేత్రదానానికి అంగీకరించారు. ఆ మేరకు స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం ఇచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి గ్రామంలోని మృతురాలి స్వగృహంలో ఆమె పార్థివదేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మట్టిలో కలిసిపోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధత్వంతో బాధపడే వారికి చూపు ఇవ్వవచ్చన్నారు. మరణించిన తర్వాత కూడా ఈ లోకాన్ని చూసే బృహత్తర కార్యానికి ప్రతి ఒక్కరు నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణిస్తే 99665 09364, 70932 04537కు సమాచారమివ్వాలన్నారు.

క్రైం కార్నర్

మద్యం మత్తులో వ్యక్తి హత్య

ప్రజాశక్తి - ముద్దనూరు

మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడి బాలయ్య (35) వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఇన్‌చార్జి సిఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేనేపల్లె గ్రామానికి చెందిన బాలయ్య కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన పుల్లయ్య ఆలయ పూజారిగా పని చేస్తున్నాడు. సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా పుల్లయ్య, బాలయ్య కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు గొడవ పడ్డారు. ఆలయం వద్దకు వెళ్లగానే పూజారి పుల్ల య్య కత్తితో బాలయ్య గుండెల్లో పొడిచాడు. అక్కడికక్కడే బాలయ్య మృతి చెం దాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు సిఐ తెలిపారు. బాలయ్యకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతి చెందిన బాలయ్య

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మండలంలోని ఆశోక్ నగర్‌కు చెందిన మదన్ మోహన్ (38)అనే వ్యక్తి ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని ఆశోక్ నగర్‌కు చెందిన ఉమ్మినేని మదన్‌మోహన్ అనే వ్యక్తి పొలంలో సాగు చేసిన అరటి చెట్లుకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. అరటి చెట్లుకు నీరు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురైనట్లు మృతుడి బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి మంగళవారం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మృతదేహాన్ని సందర్శించి సంఘటనపై బంధువులను అడిగి తెలుసుకున్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరుగా 36 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గ్రామంలోని ఆయా ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా 36 బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సమాచారం మేరకు ఎస్ఐ తిరుపాల్ నాయక్ ఆధ్వర్యంలో అక్రమ మద్యం అమ్మకాలపై దాడులు చేశారు. బిడ్డాలమిట్ట ప్రాంతంలో వలి బాషా అనే వ్యక్తి వద్ద 10 మద్యం బాటిళ్లను, పులివెందుల రోడ్డులోని ఐటిఐ సమీపంలో జాల ఈశ్వరయ్య అనే వ్యక్తి 26 మద్యం బాటిళ్లను తీసుకెళుతుండగా వాటిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

తెల్లబోతున్న పత్తి రైతు

పెట్టుబడి కూడా రాని వైనం.. నాడు వాతావరణం అనుకూలించక.. నేడు ధర లేక నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పత్తిసాగు చేసిన రైతులకు ఈ ఏడాది నిరాశే మిగులుతోంది. పత్తి సాగు చేసినప్పటి నుంచి వాతావరణం అనుకూలించకపోవడంతో పూత సరిగా రాలేదు. దీనికితోడు వర్షాలు సకాలంలో కురవకపోవడంతో మొక్కల ఎదుగుదల నిలిచిపోయింది. పండిన పంటకు మార్కెట్‌లో సరైన ధర లేదు. ఇలా అన్ని విధాలా పత్తి రైతులకు దెబ్బమీద దెబ్బ తగిలింది. నియోజకవర్గంలో పత్తి సాగు ఆశాజనకంగా లేకపోవడంతో పత్తి పంటపై వచ్చే రాబడిని రైతులు వదులుకునే పరిస్థితులు నెలకొన్నాయి. పెట్టుబడులు వచ్చే పరిస్థితులు లేకపోవడంతో దున్ని ఏమైనా ఇతర పంటలు వేద్దామనుకుంటే సాగునీరు అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పత్తిసాగుకు వేల రూపాయలు పెట్టినా కనీసం పెట్టుబడులు వచ్చే పరిస్థితులు కనబడడం లేదని రైతులు వాపోతున్నారు. రైతులు పత్తి సాగు కోసం ఎకరాకు రూ.20నుంచి రూ.25వేల వరకు ఖర్చు చేశారు. కానీ సకాలంలో వర్షాలు లేక పత్తి దిగుబడి అమాంతం తగ్గింది.

దిగుబడిపై ప్రభావం..

ఈ ఏడాది వాతావరణ పరిస్థితుల కారణంగా పత్తి దిగుబడి పూర్తిగా తగ్గింది. సరైన నీటి వసతులు లేక రైతులు వర్షాధారంపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. ఈ క్రమంలో వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు ఆలస్యంగా కురవడంతో సాగు కొంత వెనుకబడింది. ఆ తర్వాత వర్షాలు కురవడంతో రైతులు విత్తనాలు విత్తుకున్నారు. సీజన్ మధ్యలోనూ వర్షాలు కొంత దోబూచులాడాయి. పత్తి పంట కాత, పూత సమయంలో సరైన వర్షాలు కురవకపోవడంతో ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదు. ప్రతీ సీజన్‌లో ఎకరాకు పత్తి 7నుంచి 10క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈ ఏడాది ఎకరాకు కేవలం 5క్వింటాళ్ల లోపే దిగుబడి మాత్రమే వస్తుందని రైతులు వాపోతున్నారు. దీంతో సాగు కోసం చేసిన అప్పులు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం పత్తి ఏరివేత కొనసాగుతుంటంతో కూలీల ఖర్చులు కూడా అమాంతం పెరిగా యంటున్నారు. పత్తితీసేందుకు వచ్చే కూలీలకు కిలోకు రూ.10 ఇస్తేనే వస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. సాగు చేయడం కంటే కూలి పనికి వెళ్లడమే మేలని రైతులు పేర్కొంటున్నారు.

సాగులో ఉన్న పత్తి పంట

గిట్టుబాటు ధరలేక నిల్వ ఉంచిన పత్తి దిగుబడి

ధరాఘాతం..

ధర లేక పత్తి రైతు తెల్లబోతున్నాడు. గిట్టుబాటు ధర వస్తుందన్న ఆశతో గతేడు పండించిన పంటను ఇళ్లల్లో నిల్వ ఉంచినా ఫలితం లేకపోయింది. కాగా ఈ ఏడాది పత్తి ధర ప్రస్తుతం క్వింటాకు రూ.5000 నుంచి రూ.5,800 వరకు పలుకుతుండడంతో రైతులు దిగులు పడుతున్నారు. ఏటేటా పత్తి ధర పతనం అవుతుండడం పత్తి సాగుపై రైతులు ఆశలు వదులుకునేలా ఉంది. పత్తి సాగు మొదలు కొని పంట చేతికొచ్చే సమయం వరకు వేల రూపాయలు పెట్టుబడులు అవుతున్నాయని.. కనీసం సాగు కోసం పెట్టిన పెట్టుబడులు కూడా రాలేని పరిస్థితిలో ఉంటే తమ కుటుంబ పోషణ కూడా భారంగా మారే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. గతేడాది పత్తి క్వింటాకు రూ.8 వేల పైచిలుకు ధర పలకగా పెట్టిన పెట్టుబడులు పోనూ కొంత మిగిలేది. ఈసారి సాగుకు చేసిన ఖర్చులు కూడా వచ్చేలా కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయే పరిస్థితులు ఏర్పడితే ప్రభుత్వాలు కూడా పట్టించుకోవడం లేదనే అభిప్రాయం రైతుల్లో ఉంది.

దిగుబడి లేదు.. ధర లేదు..

ఈ ఏడాది పత్తిసాగు చేసిన రైతుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. ఎకరాకు కేవలం ఐదు క్వింటాళ్ల లోపే దిగుబడి వస్తుండడంతో ఖర్చులు కూడా రాని పరిస్థితి. దిగుబడి లేక దిగాలుగా ఉంటే ధర కూడా లేదు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ధర లేకపోవడంతో పత్తిని నిల్వ ఉంచాల్సిన పరిస్థితి వచ్చింది.

-రామచంద్రారెడ్డి, రైతు, కొండ్రెడ్డిపల్లి గ్రామం, వేముల మండలం

ఖర్చులు పెరిగాయి..

ఏటేటా పత్తి సాగుకు ఖర్చులు పెరుగుతున్నాయి. పత్తి సాగు చేసే రైతుకు ఎకరాకు రూ.15 నుంచి రూ.20 వేలు ఖర్చు అవుతోంది. పత్తికి మద్దతు ధర కూడా లభించకపోవడంతో ఖర్చులు కూడా వచ్చేలా కనిపించడం లేదు. ధర మాత్రం క్వింటాకు ఐదు వేల లోపే పలుకుతోంది. దీంతో ఖర్చులు తప్ప లాభం ఏ మాత్రం వచ్చేలా లేదు.

- చలమారెడ్డి కొత్తపల్లి గ్రామం, వేముల మండలం

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలు

గాలిపటాలు ఎగురవేస్తున్న తులసిరెడ్డి, నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వేంపల్లెలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి గాలి పటాలను విడిచి పెట్టారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ మకర సంక్రాంతి అనేది పెద్దల పండుగ, పల్లెల పండుగ, అల్లుళ్ల పండుగ, రైతుల పండుగగా పేర్కొన్నారు. ప్రకృతికి, మనిషికి మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియజేసేదే పండుగ అన్నారు. మకర సంక్రాంతి రోజు నుండి ఉత్తరాయన పుణ్యకాలం ప్రారంభమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.3 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేసి, వ్యవసాయాన్ని పండుగ చేస్తుందని తులసిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, ధృవకుమార్‌రెడ్డి, రామకృష్ణ, ఉత్తన్న, నరసింహారెడ్డి, సుబ్బరాయుడు, మాస్, వినయ్, రవి, పీరుబాషా, వెంకటేష్, సుబ్రమణ్యం శర్మ, రఫీ, జానకీరామ్, సుదర్శన్, చిన్న సుబ్బరాయుడు, అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణ మహోత్సవం

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శ్రీ వృషభాచలేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మెయిన్ బజార్‌లో ఉన్న శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. వేంపల్లె గ్రామంలోని పురవీధుల గుండా ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న భక్తులు స్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో వృషభచలేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కుర్రాకుల వెంకటేష్, ఆలయ ఇఒ శ్రీధర్, ఆలయ పాలక మండలి సభ్యులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో మాధవరాయ స్వామి

మైదుకూరు : కనుమ పండుగ సందర్భంగా మంగళవారం పట్టణంలోని మాధవరాయ స్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూలతో అలంకరించారు. మంగళవారం సాయంత్రం మాధవరాయ స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పలు ఏర్పాట్లు చేశారు.

రాములోరి పార్వతి పార్వేట ఉత్సవం

దువ్వూరు : మండల పరిధిలోని పాత దువ్వూరులో వెలసిన శ్రీ కోదండరామాలయం నుండి దువ్వూరు మీదుగా పుల్లారెడ్డిపేటలోని డిగ్రీ కళాశాలలో రాములవారి పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాములవారి రథం ముందర తెలుగు సంప్రదాయ పద్ధతిలో కోలాటం, చెక్కభజనతో దువ్వూరు గ్రామ ప్రజలు వీక్షించారు. కార్యక్రమంలో దువ్వూరు గ్రామ, మండల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు

కనుల పండువగా చియ్యపాడులో..

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో జనమేజయ మహారాజుచే ప్రతిష్ఠించబడిన పురాతన దేవాలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ నిర్వహించారు. ధర్మకర్త మండలి చైర్మన్ మహానందిగారి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ ఎస్ఆర్ బాల నరసింహారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పార్వేట, గ్రామోత్సవం

సంక్రాంతి పండగ ముగింపు సందర్భంగా మంగళవారం గ్రామాల్లో పార్వేట ఉత్సవాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అల్లాడుపల్లె వీరభద్ర స్వామి, వెదురూరు పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి, చియ్యపాడు చెన్నకేశవస్వామి ఉత్సవ

కల్యాణంలో మాజీ జడ్‌పిటిసి బాల నరసింహారెడ్డి కుటుంబసభ్యులు

విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, గ్రామోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, భజన ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. చియ్యపాడు చెన్నకేశవ స్వామి మండల పరిధిలోని బసిరెడ్డిపల్లె, రేపల్లె, సిద్ధారెడ్డిపల్లెల్లో గ్రామోత్సవం నిర్వహించారు. చియ్యపాడు, సిద్దారెడ్డిపల్లె గ్రామంలో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి బహూమతులు అందజేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం వాసవి కాలనీలో మంగళవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉల్లాసంగా ఉత్సాహంగా సాగాయి. శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబిం బించేలా తీర్చిదిద్దిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాలపొంగు కార్యక్రమం ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసి న కోలాటం అందరిని అలరించింది. చివరిగా పార్వేట ఉత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో మిట్ట శ్రీహరి, మిట్ట కరుణాకర్, మిట్ట రామ్మోహన్‌రావు, మిట్ట వెంకటసుబ్బయ్య, 2వ వార్డు కౌన్సిలర్ మిట్ట గంగాలక్ష్మి, దొంతు రవిశంకర్, పుల్లగూర సుధాకర్, కొప్పరపు రమణ, ఆల య కమిటీ దొంతు మురళి, ఆలయ అర్చకులు వేణుగోపాల ఆచార్య పాల్గొన్నారు.

పొంగుపాలు చేస్తున్న మహిళలు

కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

గెలుపే లక్ష్యంగా వ్యూహాత్మకంగా పనిచేయాలని టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మంగళవారం ఎర్రగుంట్ల మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం కమలాపురం విచ్చేస్తున్న సందర్భంగా జమ్మలమడుగు నియోజకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలకాలని కోరారు. చంద్రబాబు నాయుడు పాల్గొను రా కదలి రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


స్వెటర్లు అందిస్తున్న దాతలు

విభిన్నప్రతిభావంతులకు స్వెటర్లు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

తొండూరు మండలం గంగనపల్లి గ్రామానికి చెందిన ఓబులరెడ్డి రామచంద్రారెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారుడు ఓబుల్‌రెడ్డి, సాయిభరత్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ముద్దనూరు రోడ్డులోని విభిన్నప్రతిభావంతుల కమ్యూనిటీ భవనంలో మంగళవారం స్వెటర్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సునీల్, వైసిపి యూత్ నాయకుడు ప్రదీప్‌రెడ్డి, పోరెడ్డి జస్వంత్‌రెడ్డి (నానీ), చింతలజూటూరు గోవిందరెడ్డి, అజయ్‌రెడ్డి, యోహాన్, మహి, కార్తీక్, మిత్రులు పాల్గొన్నారు.

సోమిరెడ్డిపల్లి సర్పంచ్ రామయ్య మృతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

సోమిరెడ్డిపల్లె సర్పంచ్ రామయ్య అనారోగ్యంతో మంగళవారం బెంగళూరులోని హాస్పిటల్‌లో మృతి చెందారు. మండలంలోని సోమిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ సర్పంచ్ రామయ్య. ఆయన ఆర్మీలో పనిచేసి రిటైర్మెంట్ అయిన తర్వాత సర్పంచ్‌గా పోటీ చేసి గెలిచారు. తన దేశసేవలో నేర్చుకున్న సేవా దృక్పథాన్ని పాటిస్తూ ఉదారత, సేవాభావాలను సర్పంచ్ పదవిలో ఉండి పేద ప్రజలకు అందించారు. సర్పంచ్ రామయ్య అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరపాలని ఆయన అభిమానులు, గ్రామపంచాయతీ ప్రజలు, నరసన్నపల్లె గ్రామస్తులు కోరుతున్నారు.

రామయ్య (ఫైల్‌ఫోటో)

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

శిల్పారామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం కనుమ పండుగ సందర్భంగా శిల్పారామంలో ఒక్క ఛాన్స్ ప్రోమో రిలీజ్ కార్యక్రమం, కామెడీ స్కిట్స్, డ్యాన్స్ ప్రోగ్రాం ప్రేక్షకులను ఎంతగానో అలరించాయని శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా ముగిశాయి. కార్యక్రమంలో రామాపురం దర్శకుడు హేమారెడ్డి, సారథి మూవీ దర్శకుడు జకార్తా రమేష్, మా ఊరి సినిమా పులివెందుల మహేష్, నృత్య శిక్షకులు శర్వన్, నంద, సిబ్బంది పాల్గొన్నారు.

నృత్యాలు చేస్తున్న యువత

దోస సాగులో రైతులు నిమగ్నం

సరస్వతిపేట వద్ద సాగు చేస్తున్న దోస పంట

ప్రజాశక్తి - చాపాడు

నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు దోస సాగులో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా చాపాడు, మైదుకూరు, ఖాజీపేట మండలాల్లో దోస సాగును రైతులు చేపడుతున్నారు. సాధారణ రకంతోపాటు, జ్యూస్ రకం దోసకాయలను అధికంగా సాగు చేస్తున్నారు. చాపాడు మండల పరిధిలో అయ్యవారిపల్లి, రామదాసుపురం, సీతంపల్లె, సీతారామపురం, చియ్యపాడు, మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో సరస్వతిపేట, చుట్టుపక్కల ఖాజీపేట మండల పరిధిలో బక్కాయపల్లి, గుంటూరు కొట్టాల , నడిపెన్న కొట్టాలు, భూమాయపల్లి గ్రామాల పరిధిలో దోస సాగును చేపడుతున్నారు. గత ఏడాది సాగు చేసి నిలువ చేసిన విత్తనాలు, కంపెనీ ప్యాకెట్ విత్తనాలు సాగు చేస్తున్నారు. ప్యాకెట్ రూ.1,300 వెచ్చించి కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. ఎకరాకు రెండు ప్యాకెట్లు వినియోగిస్తున్నారు. అలాగే సాగుతో పాటు ఎరువులు వినియోగిస్తున్నారు. కాడి ఎద్దులకు, ఎరువులకు ఈ ఏడాది అధికంగా ఖర్చు అవుతోందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు రూ.12 వేలకు పైగా ఖర్చు అవుతుందని చెబుతున్నారు. నియోజకవర్గ పరిధిలో వెయ్యి ఎకరాల వరకు దోస సాగు చేపట్టేందుకు రైతులు ఏర్పాట్లు చేపడుతున్నారు. వారం పది రోజుల్లో సాగు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆమేరకు పొలాల్లో దుక్కులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పులివెందుల రూరల్ : విశ్రాంత తహశీల్దార్ కుర్లి వెంకటేష్ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు బెస్తవారిపల్లె డాక్టర్ కుర్లి శంకర్ కోడలు , గుంటూరు మెడికల్ కళాశాలలో ఆప్తమాలజీ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ విజయలక్ష్మి ఇతర వైద్య నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేశారు. వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందించారు. రెండు దశాబ్దాలకుపైగా సొంత ఊరిని, జన్మభూమిని మర్చిపోకుండా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్న డాక్టర్ శంకర్ కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు. ఈ దాదాపు 200 మంది రోగులు చికిత్సలు పొందారు. కార్యక్రమంలో ఎపి విభిన్న ప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, వేముల మండల విభిన్నప్రతిభావంతుల సంఘం నాయకులు శివరామిరెడ్డి, దొండ్లవాగు లక్ష్మీనారాయణరెడ్డి, వైసిపి యూత్ లీడర్ ప్రదీప్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శంకర్